
సాక్షి
కాకినాడ
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



అంగరంగ వైభవం

గౌతమీ నదీ తీరాన కోనసీమ తిరుపతిగా ఖ్యాతి గాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. 8లో



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 78,931 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,800 క్యూసెక్కుల నీరు వదిలారు.

వెండి మకర తోరణం సమర్పణ



మామిడికుదురు: అదుర్రులోని సర్వ మంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతీదేవికి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుల జగన్నాథశాస్త్రి, కామేశ్వరి దంపతులు మంగళవారం వెండి మకర తోరణం సమర్పించారు. ఎనిమిది కిలోల వెండితో తయారు చేయించిన ఈ తోరణానికి రూ.ఆరు లక్షలు ఖర్చయినట్టు తెలిపారు.

న్యూస్‌రీల్

ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

కాకినాడ సిటీ: కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదుకు ఎన్నికల సంఘం నవంబర్ 28 వరకు అవకాశం ఇచ్చింది. ఇందులో భాగంగా మంగళవారం ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 షెడ్యూల్ (ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్)ను కలెక్టర్ షణ్మోహన్ విడుదల చేశారు. ఈ నెల 29 నాటికి జిల్లాలో మొత్తం 16,35,030 ఓటర్లుండగా, వీరిలో 8,04,838 మంది పురుషులు, 8,30,002 మంది మహిళలు, 190 మంది ఇతరులు ఉన్నారు. వచ్చే నెల 9, 10, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కొత్తవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తుది ముసాయిదా ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6న ప్రచురిస్తారని చెప్పారు.

ఏడు జిల్లాల అధికారులకు ముగిసిన శిక్షణ




శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

సామర్లకోట: అభివృద్ధి ప్రణాళికలపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. ఏడు జిల్లాలకు చెందిన డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, పంచాయతీల కార్యదర్శులు, సాంకేతిక సిబ్బందికి రెండు రోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, రెండు బ్యాచ్‌ల్లో 11 జిల్లాల్లోని 198 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల అధికారులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

బస్తీమే కుస్తీ

- కాకినాడ కూటమిలో బిగ్ ఫైట్
- జనసేన ఎంపీ ఏకపక్ష ధోరణిపై టీడీపీలో అసంతృప్తి
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కు ఫిర్యాదులు
- నిట్టనిలువునా చీలిన కూటమి
- తారాస్థాయికి ఎంపీ, ఎమ్మెల్యే మధ్య వార్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి నేతలు ఆధిపత్యం కోసం బస్తీమే సవాల్ అంటున్నారు. కాకినాడ నగరంలో కూటమి నిట్టనిలువునా చీలిపోయింది. జనసేన, టీడీపీ నేతలు ఎంపీ, ఎమ్మెల్యే వర్గాలుగా విడిపోయి ప్రతి చిన్నదానికి తన్నుకుంటున్నారు. అధికారుల బదిలీ కోసం మొదలైన ఆధిపత్య పోరు మద్యం, బాణసంచా షాపులు దక్కించుకునే వరకు దారి తీసింది. ఒక వర్గానికి వచ్చిన షాపులను మరో వర్గం లాగేసుకునే ప్రయత్నాలతో ఇరువర్గాలు రోడ్డెక్కి రచ్చరచ్చ చేస్తున్నాయి. జనసేన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, టీడీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది.

ఆర్డీఓ బదిలీ వ్యవహారంలో రాజుకున్న అగ్గి

ఇటీవల కాకినాడ ఆర్డీఓ బదిలీ వ్యవహారంలో ఇరువురి మధ్య సఖ్యత చెడిందంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉన్నప్పటి నుంచి కాకినాడలో వివిధ హోదాల్లో పనిచేసిన మల్లిబాబును ఆర్డీఓగా తీసుకురావాలనేది ఎంపీ ఉదయ్ ఆలోచన. ఇక్కడ జెడ్పీ సీఈఓగా పనిచేసిన సత్యనారాయణను ఆర్డీఓగా నియమిస్తామని కొండబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఒప్పందాలు కూడా జరిగాయి. ఆర్డీఓ బదిలీల్లో ఎంపీ పెత్తనం ఏమిటంటూ ఎమ్మెల్యే వర్గీయులు విమర్శలకు దిగారు. చివరకు ఈ బదిలీ వ్యవహారం ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఎంపీ సిఫారసు చేసిన మల్లిబాబు ఆర్డీఓగా నియమితులయ్యారు. ఇది చాలదు అన్నట్టుగా ఒకప్పుడు సిటీ ఎమ్మెల్యే కొండబాబుకు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన టీడీపీ సిటీ అధ్యక్షుడు నున్న దొరబాబు ఆ శిబిరం నుంచి బయటకు వచ్చేసి ఎంపీ శ్రీనివాస్ శిబిరంలో చేరారు. ఎమ్మెల్యే కొండబాబు వ్యవహారాలను అతని సోదరుడు సత్యనారాయణ సమన్వయం చేసుకునేవారు. సత్యనారాయణతో పాటు దొరబాబు కూడా కలిసే ఉండేవారు. అటువంటిది వీరిద్దరి మధ్య వచ్చిన పొరపొచ్చాలతో దొరబాబు ఎమ్మెల్యే శిబిరం నుంచి బయటకు వచ్చేశారు. సరిగ్గా అదే సమయంలో జనసేన రూపంలో కాకినాడ ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్ గెలుపొందడంతో దొరబాబు ఆ శిబిరంలో చేరి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారని పార్టీ శ్రేణులు అంటున్నాయి. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య వైషమ్యాలు పెరుగుతూ వచ్చి చివరకు మద్యం, బాణసంచా షాపుల వ్యవహారంలో పట్టుదలతో తారా స్థాయికి చేరుకుని రోడ్డెక్కే వరకు వెళ్లాయనేది పరిశీలకుల మాట.

ఎంపీని ఏకాకిని చేసే వ్యూహం

జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వివిధ కారణాలతో కాకినాడ ఎంపీ శ్రీనివాస్‌ను ఇటీవల కాలంలో దూరం పెట్టారనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఎంపీ కూటమిలోని ఎమ్మెల్యేలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పోతున్నారని ఆయా నియోజకవర్గాల నేతలు ఆగ్రహంతో ఇప్పటికే పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదులు చేశారని కూటమి నేతలు గుసగుసలాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమిలో ఎంపీ శ్రీనివాస్‌ను ఏకాకిని చేసే వ్యూహంలో భాగంగానే టీడీపీ నేతలు తెర వెనుక ఉండి కొండబాబును నడిపిస్తున్నారనే చర్చ నడుస్తోంది.

ముక్కున వేలేసుకుంటున్న జనం

కాకినాడ సంజయ్‌నగర్‌లో ఒక మద్యం దుకాణాన్ని డ్రాలో తెలంగాణాలోని సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన కొకుట్ల జీవన్ రెడ్డి అనే కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. షాపు ఏర్పాటు కోసం లీజు అగ్రిమెంట్ చేసుకుని పనులు మొదలుపెట్టేసరికి ఎమ్మెల్యే కొండబాబు ముఖ్య అనుచరుడు, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, అతని అనుచరగణం అడ్డుతగిలారు. ఇంతకీ షాపు దక్కించుకున్న లీజుదారుడు ఎంపీ శ్రీనివాస్‌కు సహచరుడు. అదే కారణంతో ఎమ్మెల్యే కొండబాబు తన అనుచరులను రెచ్చగొట్టి దౌర్జన్యంగా మద్యం షాపును లాగేసుకునేందుకు ప్రయత్నించారని ఎంపీ వర్గం ఆరోపిస్తోంది. ఇది చినికిచినికి గాలివానగా మారి పోలీసుల వరకు వెళ్లింది. ఈ రెండు వర్గాల మధ్య ఈ వివాదం కొనసాగుతుండగానే తాజాగా కాకినాడ మెయిన్‌రోడ్డులో బాణసంచా షాపు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కొండబాబు వర్గం ప్రయత్నించింది. ఎప్పుడూ జనంతో రద్దీగా ఉండే మెయిన్‌రోడ్డులో మందుగుండు షాపు ఇచ్చిన దాఖలాలు లేవని, ప్రమాదకరమనే కారణంతో అధికారులు అనుమతి ఇవ్వలేదు. మద్యం దుకాణం విషయంలో గొడవ చేసినందుకు ప్రతీకారంగా ఎంపీ కావాలనే మందుగుండు షాపునకు అనుమతి రాకుండా అడ్డుకున్నారని ఎమ్మెల్యే వర్గీయులు ఆరోపిస్తూ సోమవారం రాత్రి రోడ్డెక్కడం అటు జనసేన, ఇటు టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏదో ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసినట్టు వ్యక్తిగత లాభాపేక్ష కోసం నిర్వహించే మద్యం, బాణసంచా షాపుల కోసం రోడ్డెక్కుతారా అంటూ టీడీపీ నేతల తీరుతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో ఎప్పుడూ ఏ పార్టీ ఇలా దిగజారుడు రాజకీయాలకు పాల్పడలేదని ఆక్షేపిస్తున్నారు.

వేట్లపాలెం విచారణ తుస్..



పంచాయతీలో విచారణ చేస్తున్న అధికారులు

సామర్లకోట: మేజర్ పంచాయతీ వేట్లపాలెంలో నిధుల దుర్వినియోగంపై మంగళవారం నిర్వహించిన విచారణ తుస్సుమంది. పంచాయతీలో రూ.4 కోట్ల వరకు 2017–18 నుంచి 2022–23 వరకు నిధుల దుర్వియోగంపై లోకాయుక్తలో కేసు నమోదైంది. కలెక్టర్ ఆదేశాలతో జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు, జిల్లా ఆడిటర్ వై.సురేష్‌బాబు మంగళవారం పంచాయతీలో విచారణ చేపట్టారు. సీఈఓ మాట్లాడుతూ, పంచాయతీ రికార్డులు పరిశీలించి.. అవినీతి ఎలా, ఏ మేరకు జరిగిందో నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న 9 మందిలో 8 మంది హాజరైనట్టు తెలిపారు. రికార్డులు పంచాయతీలో లేవని, కోర్టులో ఉన్నాయని ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి వి.సునీల్ కుమార్ చెప్పారు. డీఎస్పీ, కోర్టు అధికారులతో మాట్లాడి, రికార్డులను తెప్పించి విచారణ చేస్తామని సీఈఓ తెలిపారు. విచారణలో డీఎల్‌పీఓ కె.అన్నామణి, ఎంపీడీఓ బొబ్బరాడ సత్తిబాబు పాల్గొన్నారు.

రత్నగిరి ఈఈపై ఏఈ దురుసు ప్రవర్తన

సస్పెన్షన్‌కు ఈఓ ఆదేశాలు

అన్నవరం: దేవస్థానం ఈఈ వి.రామకృష్ణపై దురుసుగా ప్రవర్తించిన వాటర్ వర్క్స్ ఏఈ(కాంట్రాక్ట్) ఎం.గురవయ్యపై ఈఓ కె.రామచంద్రమోహన్ మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల రోజులుగా ఏఈ గురవయ్య విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. వాటర్ వర్క్స్‌పై సమీక్ష సమావేశానికి గైర్హాజర్ అవుతుండడంతో, గతంలో ఈఈ రామకృష్ణ రెండు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం రత్నగిరిపై అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు చాంబర్‌లో ఆడిట్ రివ్యూ సమావేశం జరుగుతుండగా ఏఈ గురవయ్య అక్కడకు వచ్చారు. ఐదు రోజులుగా వాటర్ వర్క్స్ రిపేర్ల ఫొటోలు ఎందుకు పంపలేదని ఈఈ రామకృష్ణ అతడిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా వాగ్వాదం తారా స్థాయికి చేరింది. అక్కడున్న ప్లాస్టిక్ కుర్చీతో తనపై దాడి చేసేందుకు యత్నించినట్టు ఈఈ రామకృష్ణ ఈఓకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అక్కడున్న అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులు, ఏఈ గురవయ్యను నిలువరించి వెలుపలకు తీసుకెళ్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఈఓ కె.రామచంద్రమోహన్ స్పందిస్తూ, ఏఈ గురవయ్యను విధుల నుంచి తప్పించారు. వాటర్ వర్క్స్ ఇన్‌చార్జి ఏఈగా సివిల్ ఏఈ(కాంట్రాక్ట్) పి.విజయ ప్రసాద్‌బాబును నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు



జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: తెల్లరేషన్ కార్డుదారులకు దీపావళి సందర్భంగా గురువారం నుంచి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్టు జేసీ రాహుల్ మీనా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, లబ్ధిదారులు ఆధార్, రేషన్ లేదా బియ్యం కార్డు, బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్ నంబర్లు కలిగి ఉండాలన్నారు. వీరి జాబితాలు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉన్నాయన్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 6.50 లక్షల మందికి తెల్లరేషన్ కార్డులున్నాయని, నిర్దేశిత 4 అర్హతలున్న వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. లబ్ధిదారులు ముందుగా గ్యాస్ ధరను చెల్లించాలని, పథకానికి అర్హులైతే వారి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. చెల్లించిన మొత్తం వారి బ్యాంకు ఖాతాకు జమవుతుందన్నారు. తొలి విడత ఉచిత సిలిండర్‌ను ఇప్పటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ బుక్ చేసుకోవచ్చన్నారు. వచ్చే ఏడాది నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్లు ఇస్తారన్నారు. నాలుగు అర్హతలు లేనివారు వాటిని సమకూర్చుకుని, పథకాన్ని పొందవచ్చన్నారు. పథకం కోసం అవకతవకలకు పాల్పడే వారిపై, ఉచిత సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్మే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, సీఎస్ డీటీ విజయకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్' ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కార్యదర్శిగా సీనియర్ అసిస్టెంట్ ఐ.శైలజా సుందరి, ఉపాధ్యక్షుడిగా సూపరింటెండెంట్ ఏవీ ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా సీనియర్ అసిస్టెంట్ జి.కామేశ్వరి ఎన్నికయ్యారు.

రూ.300 కోసం కొట్లాట, ఒకరి మృతి



వరసాల నాగరాజు మృతదేహం

పెరవలి: మద్యం మత్తులో ఇద్దరు మందుబాబుల మధ్య డబ్బుల విషయంలో జరిగిన కొట్లాటలో ఒకరు మృతి చెందారు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన వరసాల నాగరాజు (40) ఈ నెల 27వ తేదీన ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఏలూరి ప్రసాద్ వచ్చాడు. నాగరాజు జేబులోని రూ.300 తీసుకుని వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో తర్వాత రోజు చెరువు గట్టు వద్ద ఉన్న ప్రసాద్ దగ్గరకు వెళ్లి డబ్బుల విషయం గురించి నాగరాజు నిలదీశాడు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం పెరిగిపోయి, నాగరాజు కడుపులో ప్రసాద్ బలంగా తన్నాడు. దీంతో నాగరాజు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు అతడిని స్థానికంగా ఆర్ఎంపీ వద్ద తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తణుకు తరలిస్తుండగా మృతి చెందాడు. అతడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు నిడదవోలు సీఐ తిలక్ తెలిపారు.

సర్వర్ సిగ్నల్ లేక రిజిస్ట్రేషన్లకు అంతరాయం

అమలాపురం టౌన్: సర్వర్ సిగ్నల్ పనిచేయకపోవడంతో జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎదురైన ఈ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందా అని ఆయా కార్యాలయాల సిబ్బంది ఎదురు చూశారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు పడిగాపులు పడ్డారు. ఎట్టకేలకు సాయంత్రం ఐదు గంటల దాటిన తర్వాత సర్వర్‌కు సిగ్నల్ వచ్చింది. దీంతో రాత్రి పొద్దుపోయేదాకా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

అంగరంగ వైభవం



స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- ముగిసిన వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు కన్నుల పండువగా కార్యక్రమాలు
- కోనసీమ తిరుపతికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: గౌతమీ నదీ తీరాన కోనసీమ తిరుపతిగా ఖ్యాతి గాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఉత్సవాలను తిలకించారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే స్వామివారి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామిని దర్శించుకునేందుకు లక్షల మంది తరలివచ్చారు. ఉత్సవాలలో భాగంగా ఆఖరి రోజు ఉదయం స్వామివారికి మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం మహదాశీర్వచనం ఘనంగా నిర్వహించారు. తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకు వచ్చి స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం అభిషేకాలు చేశారు. గోత్ర నామాలతో పూజలు, నిత్యహోమాలు జరిగాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, దేవదాయ ధర్మదాయ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. కుటుంబ సమేతంగా పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ఘనంగా ఉత్సవాలను జరిపారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తల్లీకుమార్తెల ఆత్మహత్య

- కాకినాడలో దారుణం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఆకాశం స్వాతి (ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడలో తల్లీకుమార్తెల ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపురం పెంకేవారి వీధిలో శ్రీదుర్గానివాస్ పేరుతో జీప్లస్ వన్ భవనం ఉంది. దానిలోని కింద అంతస్తులో ఆకాశం సరస్వతి (60), ఆమె కుమార్తె స్వాతి (28) ఉంటున్నారు. సరస్వతి భర్త 16 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వివాహిత అయిన పెద్ద కుమార్తె విశాఖపట్నంలో ఉంటోంది. చిన్న కుమార్తె స్వాతి టైలరింగ్ చేస్తూ సరస్వతిని పోషిస్తోంది. కాగా.. వీరి ఇంటి నుంచి మంగళవారం దుర్వాసన రావడంతో పైఅంతస్తులో ఉన్నవారు గమనించి ఇంటి యజమాని గుర్రాల శ్రీనివాస్‌కు చెప్పారు. ఆయన సమాచారంతో సీఐ నాగదుర్గారావు, బృందం అక్కడికి చేరుకొని తలుపులు బద్దలు కొట్టి చూస్తే లోపల సరస్వతి మంచంపై పడి చనిపోయి ఉంది. స్వాతి ఉరివేసుకుని కనిపించింది. వీరిద్దరూ కలిసి ఉరి వేసుకోగా, బరువుకు చీర తెగిపోయి సరస్వతి మంచంపై ఉండి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ, ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ నాగదుర్గారావు తెలిపారు.

తల్లికి అనారోగ్యం

సరస్వతి కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. స్వాతి ఆమెను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చి వైద్యం చేయించింది. తల్లి ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తుండడంతో స్వాతి మనోవేదనకు గురయ్యేది. తాను పెళ్లి చేసుకుని వెళ్లిపోతే తల్లి ఏమైపోతుందోనని బాధపడుతూ ఉండేది. ఈ కారణంతోనే తల్లీకూతుళ్లు ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావిస్తున్నారు. కాగా.. శనివారం రాత్రి 8 గంటల సమయంలో పొరుగున ఉన్న మహిళ దుస్తులను కుట్టించుకునేందుకు స్వాతి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో తల్లీకుమార్తెలిద్దరూ నవ్వుతూనే మాట్లాడారు. ఆదివారం పాలు వేసే వ్యక్తి వచ్చి తలుపు తట్టినా తీయలేదు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి దాటాక ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.ఐదు లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ చెందిన టీకే రామచంద్రారెడ్డి నుంచి అదే నగరానికి చెందిన ఎస్.చినేష్ కుమార్ 2020లో రూ.6 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2022లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును రామచంద్రారెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో చినేష్ కుమార్‌పై నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తూరంగి హైస్కూల్లో కీచక ఉపాధ్యాయుడు

కాకినాడ రూరల్: పాఠశాలను సరస్వతీ నిలయంగా కొలుస్తాం. అందులో విద్య నేర్పే ఉపాధ్యాయుడిని గురువుగా దైవంతో సమానంగా భావిస్తాం. దేశానికి భావి పౌరులను అందించే గురుతర బాధ్యతను నెరవేర్చాల్సిన ఉపాధ్యాయుడు వక్రబుద్ధిని ప్రదర్శిస్తే.. చదువుకొనేందుకు వెళ్లిన విద్యార్థినులు పరిస్థితి ఏమిటి. ఇంటి వద్ద చెప్పలేక, ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేయలేక నరక యాతన అనుభవిస్తారు. ఇటువంటి సంఘటన కాకినాడ రూరల్ మండలం తూరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవీ. పాఠశాలలో గత నెల 28వ తేదీన ఎనిమిదో తరగతి విద్యార్థినులతో ఒక ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించినట్టు విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా బయటకు వచ్చింది. దీనిపై పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు విజయదుర్గను వివరణ కోరగా దీనిపై విద్యార్థినుల నుంచి ఫిర్యాదు అందిందని, సదరు ఉపాధ్యాయుడిని విచారిస్తే తాను అసభ్యంగా ప్రవర్తించలేదని చెప్పి, మెడికల్ లీవ్‌లో ఉన్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చామని, మహిళా పోలీసు వచ్చి విద్యార్థినుల వద్ద వివరాలు సేకరించినట్టు తెలిపారు. దీంతో ఇంద్రపాలెం ఎస్సై వీరబాబును వివరణ కోరగా తూరంగి పాఠశాలలో విద్యార్థుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు రాలేదన్నారు. ఆనోట ఈనోట ఆలకించడంతో మహిళా పోలీసును పంపించి వివరాలు సేకరించమన్నారు. కాగా.. తూరంగి పాఠశాల విషయం బయటకు రాకుండా ఉపాధ్యాయుడికి అండగా కొందరు పెద్దలు చక్రం తిప్పుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



ప్రశాంతి, కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీని పక్కదారి పట్టించేలా ఐడీ లిక్కర్, సారా బట్టీలు, గంజాయి, ఇతర మత్తు పానీయాలు, బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఐడీ లిక్కర్‌కు సంబంధించి 25 చోట్ల దాడులు నిర్వహించి 24 మందిపై కేసులు నమోదు చేశామని, 21 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రెండు వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 6500 కిలోల బెల్లంతో పాటు, ఆ వాహనాలను సీజ్ చేశామన్నారు. డీపీఎల్‌కు సంబంధించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 23 మందిని అరెస్టు చేశామని, 43.39 లీటర్ల మద్యం సీజ్ చేశారన్నారు. లాటరీ పద్ధతిలో షాపులు పొందిన వారు వాటికి అనుసంధానంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే లైసెన్సు రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారన్నారు. జిల్లాలో 125 మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యాపారులకు లాటరీ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. సారా తయారీ, విక్రయం, గంజాయి రవాణాపై టోల్ ఫ్రీ నంబర్‌కు 7093 273981 ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యతంగా ఉంచుతామని తెలిపారు.

కొబ్బరి ఆకు వివాదంలో కత్తిపోట్లు

- సోదరుల మధ్య ఘర్షణ
- కత్తితో దాడి చేసిన తమ్ముడు



సత్యనారాయణ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై మల్లికార్జునరెడ్డి

ఐ.పోలవరం: ఓ కొబ్బరి ఆకు కారణంగా సొంత అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి, కత్తిపోట్లకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామంలో గంజా రాధాకృష్ణ, పక్కనే అతడి అన్న సత్యనారాయణ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సత్యనారాయణ ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టు ఆకు మంగవారం విద్యుత్ తీగలపై పడింది. దీని వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై రాధాకృష్ణ ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మీ కొబ్బరి ఆకు వల్లే విద్యుత్ ఆగిపోయిందని రాధాకృష్ణ, కొబ్బరి ఆకు పడితే మా తప్పు ఏమిటని సత్యనారాయణ ఘర్షణ పడ్డారు. దీంతో ఆగ్రహం చెందిన రాధాకృష్ణ తన అన్న సత్యనారాయణ, వదిన వెంకటలక్ష్మిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. గాయపడిన వారిద్దరిని స్థానికులు యానాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు.

పశుగణన చాలా కీలకం



జగన్నాథపురంలో రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశరావు

కోటనందూరు: పాడి పరిశ్రమ అభివృద్ధికి సరైన ప్రణాళికలు రూపొందించడం కోసం పశుగణన చాలా కీలకమని జాయింట్ డైరెక్టర్ సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక పశసంవర్ధకశాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి పలు అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం భీమవరపుకోట, జగన్నాథపురం గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశుగణన జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25 నుంచి ప్రారంభమైందన్నారు. ఫిబ్రవరి 28 వరకూ కొనసాగే ఈ ప్రక్రియలో 296 మంది సిబ్బంది..ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, కుక్కలు, కుందేళ్ల వంటివాటి సమాచారాన్ని సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీధర్ పాల్గొన్నారు.

అప్పనపల్లిలో మద్యం షాపునకు తాళం



అప్పనపల్లిలో మూసివేసిన మద్యం షాపు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి పక్కన మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.సత్యనారాయణరాజు రాసిన లేఖపై కలెక్టర్ మహేష్ కుమార్ స్పందించారు. ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన షాపునకు మంగళవారం తాళం వేశారు. నివాస ప్రాంతాలు, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతం, ఆలయానికి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేశారంటూ స్థానికులు కూడా ఫిర్యాదు చేశారు.దీంతో సోమవారం ప్రారంభించిన షాపును మంగళవారం మూసేశారు. దీనిపై రాజోలు ఎక్సైజ్ శాఖ సీఐ వీరబాబును వివరణ కోరగా కలెక్టర్ మహేష్ కుమార్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు షాపును మూసి వేశామన్నారు.

జిప్‌మెర్‌లో ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి జిప్‌మెర్‌లో ఖాళీగా ఉన్న 80 మెడికల్ ప్రొఫెసర్ పోస్టులకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో జిప్‌మెర్ వైద్యకళాశాలు నడుస్తున్నాయి. దీనికి కారైకల్‌లో బ్రాంచ్ ఉంది. ఈ నేపథ్యంలో 26 మెడికల్ ప్రొఫెసర్, 35 అసిస్టెంట్ ప్రొఫెసర్, 2 మెడికల్ ప్రొఫెసర్, 17 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అర్హత కలిగిన వారు జిప్‌మెర్ వెబ్‌సైట్‌లో నవంబర్ 21లోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ రాకేష్ అగర్వాల్ తెలిపారు.

చెస్ పోటీలలో 'ఉమ్మడి తూర్పు' విజయకేతనం



విజేతలుగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు

నాగముల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తెనాలిలో ఈ నెల 28, 29 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ చెస్ పోటీలలో బాలుర విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఓవరాల్ టీం చాంపియన్ షిప్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన జిల్లా జట్టును డీఈఓ పి.రమేష్, ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి సునీల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కౌర్, ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి కుమార్ మంగళవారం అభినందించారు.

మురమళ్ల వీరేశ్వరుని ఆభరణాల తనిఖీ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు మొక్కుబడుల రూపంలో అందించిన వెండి, బంగారం ఆభరణాలను మంగళవారం తనిఖీ చేశారు. జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి విల్ల వీరపళ్లంరాజు, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 133 వెండి వస్తువులు, 82 బంగారం వస్తువులను తనిఖీ చేశారు. దేవస్థానం రికార్డుల ప్రకారం తూకంలో హెచ్చు తగ్గులు లేవని నిర్ధారించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి దేవాలయంలో వెండి, బంగారం వస్తువులను తనిఖీ చేసి దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతామన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ లాన్ టెన్నిస్ పోటీలు



అండర్ 17 బాలికల సింగిల్స్‌లో పోటీపడుతున్న క్రీడాకారిణి

నాగముల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో అండర్ 14, 17, 19 రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల లాన్ టెన్నిస్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-14 విభాగంలో డీఎస్ఏ టెన్నిస్ కోర్టులలోనూ, అండర్ 17కు సంబంధించి డీమార్ట్ మున్సిపల్ టెన్నిస్ కోర్టులలోనూ, అండర్ 19 పోటీలను టౌన్ హాల్ టెన్నిస్ కోర్టులలో నిర్వహించారు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లను టోర్నమెంట్ చీఫ్ రిఫరీ శ్రీకుమార్, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ఐ పరిశీలకులు షేక్ బాబు, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి, ఏపీ లాన్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ రామ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి సునీల్, పర్యవేక్షించారు. పోటీల నిర్వహణకు హరిష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరిష్ సహకారం అందిస్తున్నారని టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి జార్జి తెలిపారు. పోటీల నిర్వహణలో పీఈటీ సంఘ కోశాధికారి కౌర్, పీడీలు సూరిబాబు, శ్రీను, టీవీ ప్రసాద్, మంగయమ్మ, త్రిపుల, మేరి, మూర్తి, ప్రసాద్, రఘురామ్‌లు సేవలు అందించారు.

రెండోరోజు విజేతల వివరాలు

- అండర్ 19 బాలుర సింగిల్స్ మొదటి రౌండ్‌లో ఎస్.హేమంత్ సాయి, సీహెచ్ నవీన్ (చిత్తూరు), బి.కరుణ (చిత్తూరు), ఆర్.విశాల్ (రామహేంద్రవరం) విజయం సాధించారు.
- అండర్ 17 బాలికల క్వాటర్ ఫైనల్స్‌లో మనస్వి (చిత్తూరు), విశ్వశ్రీ (నెల్లూరు), జి.మేధశేషసాయి (తూర్పు), జ్యోషిత (గుంటూరు) విజయం సాధించి సెమీస్‌కు చేరుకుని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.
- అండర్ 19 బాలికల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌లో టోహిట్క (విశాఖ), హిమజా రెడ్డి (చిత్తూరు), కె.వైష్ణవి (అనంతపురం), భావన (విశాఖ) విజయం సాధించి సెమీస్‌కు చేరుకుని జాతీయస్థాయికి అర్హత పొందారు.